


# హ్యుందాయ్ అల్ట్రా-ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు

## హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:చార్జింగ్ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈవీ కార్ల కస్టమర్లకోసం ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ అల్ట్రా-ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఒకేసారి 11 అల్ట్రా-ఫాస్ట్ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను ప్రారంభించింది. వీటిలో హైదరాబాద్‌తోపాటు ముంబై, పుణె, అహ్మదాబాద్, గురుగ్రామ్, బెంగళూరులలో అల్ట్రా-ఫాస్ట్ డీసీ చార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటితోపాటు జాతీయ రహదారులైన ఢిల్లీ-ఛండీగఢ్, ఢిల్లీ-జైపూర్, హైదరాబాద్-విజయవాడ, ముంబై-సూరత్, ముంబై-నాసిక్ రోడ్లపై ఐదు అల్ట్రా-ఫాస్ట్ డీసీ చార్జింగ్ స్టేషన్లను కూడా నెలకొల్పింది. వీటిలో అన్ని చార్జింగ్ స్టేషన్లు రోజంతా తెరిచివుండనున్నాయని తెలిపింది. ఒక్కో స్టేషన్లలో డీసీ 150 కిలోవాట్లు, డీసీ 60 కిలోవాట్లు, డీసీ 30 కిలోవాట్ల సామర్థ్యంతో మూడు చార్జింగ్ పాయింట్లను నెలకొల్పింది. హ్యుందాయ్ కస్టమర్లతోపాటు ఇతర కస్టమర్లు కూడా చార్జింగ్ చేసుకోవచ్చును. చార్జింగ్ స్టేషన్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లాంగ్‌డ్రైవ్ చేసేవారికి ఈ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు ఎంతగానే ఉపయోగపడనున్నాయని పేర్కొంది. కేవలం 21 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం చార్జింగ్ కానుండటంతో సమయం ఆదాకానున్నది. 30 కిలోవాట్ల చార్జర్ ఒక్కో యూనిట్‌పై రూ.18, 60 కిలోవాట్ల చార్జర్ యూనిట్‌పై రూ.21, 150 కిలోవాట్ల చార్జర్ యూనిట్‌కు రూ.24 చార్జిని విధించింది. చార్జింగ్ స్లాట్‌ను ముందస్తు బుకింగ్‌తోపాటు చెల్లింపులు జరుపుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ చార్జింగ్ స్టేషన్లకు సమీపంలోనే రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్, ఇతర వసతులు సైతం నెలకొల్పింది. ఈ ఏడాదిలో మరో 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలనుకుంటున్న సంస్థ..2027 నాటికి ఈ సంఖ్యను 100కి పెంచుకోవాలని చూస్తున్నది.

# ఫోర్బ్స్30-30లో హుజూర్‌నగర్ వాసి

## శశాంక్ రెడ్డి గుజ్జులకు చోటు • ఏలూరుకు చెందిన అనుపమ్ పెదర్లకూ స్థానం

## హైదరాబాదీ స్టార్టప్ నెక్స్ట్ వేవ్ వ్యవస్థాపకులకు అరుదైన గౌరవం

హైదరాబాద్, ఫిబ్రవరి 15: హైదరాబాదీ స్టార్టప్ నెక్స్ట్ వేవ్ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్లకు అరుదైన గౌరవం దక్కింది. ఈ ఇరువురు తెలుగువారికి ఈ ఏడాదికిగాను తాజాగా విడుదలైన ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో చోటు లభించింది. కాగా, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన శశాంక్ రెడ్డి గుజ్జుల, ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన అనుపమ్ పెదర్ల మరొకరితో కలిసి నెక్స్ట్ వేవ్‌ను ఏర్పాటు చేశారు. ఇదో కొత్త తరం టెక్నాలజీ ఉద్యోగార్థుల ఆన్‌లైన్ ఎంప్లాయబిలిటీ ప్లాట్‌ఫామ్. ఈ వేదిక ద్వారా ఇప్పటిదాకా యువత పెద్ద ఎత్తునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను పొందడం విశేషం.

**ఉద్యోగావకాశాలు వీడి..**

ఐఐటీ బాంబేలో శశాంక్ కంప్యూటర్ సైన్స్ చదివారు. అనుపమ్.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తిచేశారు. నిజానికి ప్రతిభకు తగ్గట్టుగా వీరిద్దరికీ బడా సంస్థల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు వచ్చాయి. అయినప్పటికీ వాటన్నిటినీ కాదనుకుని యువతలో నైపుణ్యం, ప్రతిభను పెంపొందించి.. వారికి మెరుగైన ఉద్యోగాలు లభించేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రాహుల్ అట్లూరితో కలిసి నెక్స్ట్ వేవ్‌ను ప్రారంభించారు. అమెజాన్, గూగుల్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి బహుళజాతి దిగ్గజాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లోనూ నెక్స్ట్ వేవ్ ద్వారా వెళ్లినవారున్నారు. ఇలా విద్యా రంగంలో విశేష మార్పులు తీసుకువచ్చినందుకుగాను ఇప్పుడు ఫోర్బ్స్ జాబితాలో వీరిద్దరూ స్థానం సంపాదించారు.

**మూడేండ్లలోనే..**

దేశీయ విద్యా రంగంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న స్టార్టప్‌ల్లో ఒకటిగా నెక్స్ట్ వేవ్ కేవలం మూడేండ్లలోనే ఘనతను సాధించింది. ఈ నేపథ్యంలోనే గత ఏడాది గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్ నుంచి రూ.275 కోట్ల ఫండింగ్‌ను కూడా అందుకున్నది. ఇక రాబోయే రెండేండ్లలో దేశ, విదేశాల్లోని 10వేలకుపైగా కంపెనీలతో జతకట్టి అనేక ఉద్యోగావకాశాలను సృష్టించాలని నెక్స్ట్ వేవ్ లక్ష్యంగా పెట్టుకున్నది.



> ఇది మేము వ్యక్తిగతంగా సాధించిన గుర్తింపు కాదు. గొప్ప కలలు కని వాటి కోసం శ్రమిస్తున్న విద్యార్థులు, వారికి బోధిస్తున్న మా సిబ్బంది కృషికి ఈ గౌరవం దక్కుతుంది. మా సంస్థ మొదలు.. మా దృష్టి అంతా టెక్నాలజీ రంగంలో పెద్దపెద్ద అవకాశాలను అందిపుచ్చుకోవడంపైనే. ఫోర్బ్స్ గుర్తింపు మాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది.
>
> *-శశాంక్ రెడ్డి గుజ్జుల, నెక్స్ట్ వేవ్ సహవ్యవస్థాపకుడు*

> యువతనే మన దేశ బలం. వారందరూ చక్కటి నైపుణ్యాలతో ఉంటే భారత్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుంది. ప్రపంచ శ్రేణి సాంకేతిక విద్యను దేశం నలుమూలలా తీసుకెళ్లడమే మా లక్ష్యం. విద్యార్థులకు సరైన రీతిలో చేయూతనందిస్తే అద్భుతాలు జరుగుతాయి. ఫోర్బ్స్ గుర్తింపు వేలాది యువత జీవితాల్లో నెక్స్ట్ వేవ్ తెస్తున్న మార్పునకు నిదర్శనం.
>
> *-అనుపమ్ పెదర్ల, నెక్స్ట్ వేవ్ సహ వ్యవస్థాపకుడు, సీవోవో*

# ద్రవ్యోల్బణం అదుపు కష్టమే

- పెరుగుతున్న ఆహారోత్పత్తుల ధరలు, భౌగోళిక-రాజకీయ పరిణామాలతో సవాళ్లు
- ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్




ముంబై, ఫిబ్రవరి 15: ఓవైపు ఆహారోత్పత్తుల ధరలు మళ్లీమళ్లీ పెరుగుతూ షాకిస్తున్నాయని, మరోవైపు భౌగోళిక-రాజకీయ పరిణామాలు ఆందోళనకరంగా తయారవుతున్నాయని.. ఇవి ద్రవ్యోల్బణం అదుపునకు సవాళ్లు విసురుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు. గురువారం ఇక్కడ ఆర్బీఐ అధ్యక్షతన జరిగిన 59వ ఆగ్నేయాసియా దేశాల సెంట్రల్ బ్యాంక్ (ఎస్ఈఏసీఈఎన్) గవర్నర్ల సదస్సులో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక మార్పులు: కొత్త సంక్లిష్టతలు, సవాళ్లు, విధాన ఎంపికలు' అన్న అంశంపై మాట్లాడారు. ఈ క్రమంలోనే స్థిరమైన, తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం నిలకడైన ఆర్థికాభివృద్ధికి అవసరమైన పునాదుల్ని వేస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ అనేక సవాళ్లను విజయవంతంగా అధిగమించిందన్న ఆయన తద్వారా వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్నారు. 'ఈ అల్లకల్లోల పరిస్థితుల్లో భారత్ విజయాలకు బాటలు వేసింది తెలివైన ఆర్థిక, ద్రవ్య విధానాలే' అన్నారు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశ జీడీపీ 7 శాతంగా నమోదు కావచ్చన్న దాస్.. 7 శాతం ఎగువన వృద్ధిరేటు ఉండటం ఇది వరుసగా నాల్గో సంవత్సరమని గుర్తుచేశారు.

**యూపీఐ లావాదేవీలపై..**

భారత్‌లో జరుగుతున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు.. వేగవంతమైన చెల్లింపుల వ్యవస్థకు కీలకమయ్యాయన్నారు. ఇతర దేశాల్లోనూ యూపీఐ చెల్లుబాటు.. దీన్ని ఓ అంతర్జాతీయ మాడల్‌గా చేస్తున్నదని చెప్పారు. ఇక కరోనా సమయంలో సాగిన యూపీఐ లావాదేవీలు.. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై నమ్మకాన్ని పెంచేలా చేశాయని అభిప్రాయపడ్డారు.

# జీయో-బీపీ 'యూ-డిజర్వ్-మోర్'



ముంబై, ఫిబ్రవరి 15: ఇంధన రిటైలింగ్ జాయింట్ వెంచర్ జియో-బీపీ.. 'యూ-డిజర్వ్-మోర్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. తమ కస్టమర్ల అనుభవాన్ని చాటిచెప్పేలా.. వారి ప్రతిపాదనల్ని ఆచరణలో పెట్టేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పెర్ఫార్మెన్స్, సర్వీస్, టెక్నాలజీ అంశాల ప్రాతిపదికన, వాటికి మరింత ప్రాధాన్యత ఇచ్చేలా ఈ ప్రచారం సాగుతుంది. తమ బంకుల్లో డీజిల్.. వాహనదారులకు 4.3 శాతం అధికంగా మైలేజీని ఇస్తున్నదని, వాహనాల ఇంజిన్లను ఇక్కడి పెట్రోల్ ఇతర సంస్థల పెట్రోల్‌తో పోల్చితే 10 రెట్లు ఎక్కువ క్లీన్‌గా ఉంచుతున్నదని జియో-బీపీ చెప్తున్నది. అంతర్జాతీయంగా అభివృద్ధిపర్చిన 'యాక్టివ్' టెక్నాలజీ దోహదం చేస్తున్నదన్నది.

# చమురు, డీజిల్‌పై విండ్‌ఫాల్ టాక్స్ పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధర 80 డాలర్లు దాటిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశీయంగా ఉత్పత్తయ్యే క్రూడాయిల్‌పై విండ్‌ఫాల్ టాక్స్‌ను స్వల్పంగా పెంచింది. పక్షం రోజులకోసారి సవరించే ఈ పన్నును టన్ను క్రూడాయిల్‌పై రూ.3,300కు చేర్చింది. ఫిబ్రవరి 16 నుంచి ఈ కొత్త రేట్లు అమలులోకి వస్తాయి. రెండు వారాల క్రితం ఇది రూ.3,200 ఉంది. అలాగే తాజాగా డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు సుంకాన్ని లీటరుకు రూ.1.50కు పెంచింది. గతంలో దీనిపై పన్నును పూర్తిగా తొలగించి జీరో చేసింది. పెట్రోల్, విమానయాన ఇంధనం ఎగుమతులపై సుంకాన్ని జీరో శాతం వద్దే నిలిపిఉంచింది. ఇంధన కంపెనీలు అధికంగా ఆర్జించే లాభాలపై కేంద్రం విండ్‌ఫాల్ టాక్స్ విధింపును 2022 జూలై 1 నుంచి ప్రారంభించింది. ప్రపంచ మార్కెట్లో రెండు వారాల సగటు ఆయిల్ ధరల ఆధారంగా ప్రతీ పక్షం రోజులకోసారి పన్ను రేట్లను సవరిస్తుంది.






# 9 నెలల కనిష్ఠానికి వాణిజ్యలోటు

## ఎర్ర సముద్రం సంక్షోభంలోనూ పెరిగిన ఎగుమతులు

ముంబై, ఫిబ్రవరి 15: ఎర్ర సముద్రంలో రవాణా సంక్షోభానికి తోడు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, జనవరి నెలలో భారత్ ఎగుమతులు 3.12 శాతం పెరిగాయి. మూడు నెలల గరిష్ఠ స్థాయి 36.92 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో ఎగుమతులు- దిగుమతుల మధ్య వ్యత్యాసమైన వాణిజ్యలోటు తొమ్మిది నెలల కనిష్ఠస్థాయి 17.49 బిలియన్ డాలర్లకు తగ్గినట్టు గురువారం కేంద్ర వాణిజ్యశాఖ విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 ఏప్రిల్‌లో నమోదైన 15.24 బిలియన్ డాలర్ల లోటు తర్వాత ఇదే కనిష్ఠం. 2024 జనవరి నెలలో దిగుమతులు 3 శాతం పెరిగి 54.41 బిలియన్ డాలర్లకు చేరాయి. తాజా గణాంకాలపై వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్తావాల్ మీడియాతో మాట్లాడుతూ ధనిక దేశాల ఆర్థిక వ్యవస్థల మందకొడితనం, ఎర్ర సముద్రం సంక్షోభం, కమోడిటీ ధరల తగ్గుదల తదితర అంశాల నడుమ కూడా జనవరి నెలలో భారత్ ఎగుమతులు పెరిగాయన్నారు. ఎర్ర సముద్రంలో రవాణా నిలిచిపోయిన నేపథ్యంలో ఎగుమతిదారులు, సంబంధిత మంత్రిత్వ శాఖలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో మూడు దఫాలు తాను సమావేశమయ్యానని తెలిపారు. ఎగుమతిదారులకు గరిష్ఠంగా రుణాలివ్వాలని, ఈ సమయంలో రుణ చెల్లింపుల్ని పొడిగించాలని తాము బ్యాంక్‌లను సూచించామన్నారు.. అలాగే ఎగుమతి ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లను పెంచవద్దని ఎగ్జిమ్ బ్యాంక్, ఈసీజీసీలను కోరామని భర్తావాల్ చెప్పారు.

**బంగారం దిగుమతుల్లో భారీ వృద్ధి**

ఈ ఏడాది జనవరి నెలలో క్రూడాయిల్ దిగుమతులు 4.33 శాతం పెరిగి 16.56 బిలియన్ డాలర్లకు చేరాయి. బంగారం దిగుమతులు భారీగా 174 శాతం వృద్ధిచెంది 1.9 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్యకాలంలో మాత్రం ఎగుమతులు 4.89 శాతం క్షీణించి 353.92 బిలియన్ డాలర్లకు తగ్గగా, దిగుమతులు సైతం 6.71 శాతం తగ్గి 561.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ పది నెలల్లో వాణిజ్యలోటు 207.2 బిలియన్ డాలర్లకు దిగింది. క్రూడ్ దిగుమతులు 15.91 శాతం క్షీణించి 146.75 బిలియన్ డాలర్లకు చేరగా, బంగారం దిగుమతులు జోరుగా 301.7 శాతం వృద్ధిచెంది 38 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

# పేటీఎంపై ఈడీ కత్తి

## ఎగ్జిక్యూటివ్‌లపై ప్రశ్నల వర్షం | డాక్యుమెంట్లు స్క్రూటినీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: బ్యాంకింగ్ రెగ్యులేటర్ రిజర్వ్‌బ్యాంక్ నిషేధానికి గురైన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. తొలుత ఆర్బీఐ నుంచి కావాల్సిన సమాచారం అందుకున్న ఈడీ అధికారులు గురువారం పేటీఎం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. విదేశాలకు నగదు బదిలీకి సంబంధించిన ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)ను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఉల్లంఘించిందన్న ఆరోపణలతో ఈడీ దర్యాప్తు మొదలుపెట్టింది. అయితే ఫారెక్స్ ఉల్లంఘనలకు పాల్పడలేదని ఇప్పటికే సంస్థ ఖండించినప్పటికీ, ఇందుకు సంబంధించి పేటీఎం సమర్పించిన కొన్ని డాక్యుమెంట్ల ఆధారంగా పేటీఎం ఎగ్జిక్యూటివ్‌లను ప్రశ్నించారు. మరికొంత సమాచారం కావాలని ఈడీ అధికారులు అడిగారని, ఇప్పటివరకూ అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ కాలేదని అధికార వర్గాలు వివరించాయి. ఫెమా చట్టాన్ని ఉల్లంఘించినట్టు తేలితే ఈడీ కేసు రిజిష్టర్ చేస్తుంది.

**పీఎంఎల్‌ఏ కింద ఇప్పటికే నిఘా**

ప్రివెన్షన్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద పేటీఎం కార్యకలాపాలపై కొద్దికాలంగా దర్యాప్తు జరుగుతున్నదని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో పేటీఎం బ్రాండ్ నేమ్‌తో ఫైనాన్షియల్ సర్వీసెస్ అందింపఏ ఒన్97 కమ్యూనికేషన్స్, దాని అనుబంధ బ్యాంకింగ్ సబ్సిడరీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లు పలు నోటీసులు అందుకున్నాయి. ఈ విషయాన్ని పేటీఎం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడిస్తూ తమ కస్టమర్లు, వారికి సంబంధించిన సంస్థల వివరాలు సమర్పించాలని, వివరణలు ఇవ్వాలంటూ ఈడీతో పాటు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) నుంచి నోటీసులు వచ్చాయని తెలిపింది. వీటిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని, డాక్యుమెంట్లను అందిస్తున్నట్టు పేటీఎం వివరించింది. మర్చెంట్ ఐడీలను క్రియేట్ చేసుకుని ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా చైనా మొబైల్ ఫోన్ యాప్స్ నిధుల్ని తరలిస్తున్న కేసులో పేటీఎం, ఇతర ఆన్‌లైన్ పేమెంట్ వాలెట్స్ పై ఈడీ దర్యాప్తు జరుపుతున్నది. అలాగే పీఎంఎల్ఏ చట్టం సెక్షన్ 13 కింద 'రిపోర్టింగ్ ఎంటిటీ'కి అవసరమైన నిబంధనల్ని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ పాటిస్తున్నదా? లేదా? అనే అంశాన్ని విశ్లేషించి, రిపోర్ట్ చేయాలంటూ ఆర్బీఐని ఎఫ్ఐయూ కోరింది. యాంటీ మనీ లాండరింగ్ చట్టంలోని ఈ సెక్షన్ కింద నిధుల్ని తరలిస్తున్న క్లయింట్లు, ఆ నిధులు అందుకునేవారికి చెందిన లావాదేవీలను, డాక్యుమెంట్లతో పాటు క్లయింట్లకు చెందిన అకౌంట్ ఫైళ్లు, బిజినెస్ కరస్పాండెన్స్ వివరాల్ని ఎఫ్ఐయూకు సంబంధిత ఆర్థిక సంస్థ సమర్పించాల్సి ఉంటుంది.

**షేరు మరింత పతనం**

ఈడీ దర్యాప్తు వార్తల నేపథ్యంలో గురువారం పేటీఎం మాతృసంస్థ ఒన్97 కమ్యూనికేషన్స్ షేరు మరో ఐదు శాతం పతనమయ్యింది. ఎక్స్ఛేంజీలు ఈ షేరుకు అనుమతించిన 5 శాతం లోయర్ సర్క్యూట్ పరిమితి రూ.325 వద్ద ఫ్రీజ్ అయ్యింది. ఈ స్టాక్ లిస్టయిన తర్వాత ఇదే అత్యంత కనిష్ఠస్థాయి. జనవరి 31న ఆర్బీఐ నిషేధం విధించిన తర్వాత ఇప్పటివరకూ ఇది 60 శాతం పడిపోయింది. ఇన్వెస్టర్లు దాదాపు రూ. 27,000 కోట్ల సంపద కోల్పోయారు. ఫిబ్రవరి 29 తర్వాత పేటీఎం బ్యాంక్ డిపాజిట్లు తీసుకోరాదని, కస్టమర్ ఖాతాలు, వ్యాలెట్లలో టాప్ అప్స్. ఫాస్ట్‌ట్యాగ్స్, ప్రిపెయిడ్ సాధనాలు ఇవ్వరాదంటూ జనవరి 31న ఆర్బీఐ నిషేధ చర్యల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై తాము ప్రకటించిన చర్యల్ని సమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత్‌దాస్ మూడు రోజుల క్రితమే స్పష్టం చేసినదీ విదితమే.



# యమహా 125సీసీ స్కూటర్లు రీకాల్

## ఫ్రీ సర్వీసింగ్‌కు సంస్థ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఇండియా యమహా మోటర్ తమ 125సీసీ స్కూటర్ మాడళ్లు రే జెడ్ఆర్ 125 ఫై హైబ్రిడ్, ఫాసినో 125 ఫై హైబ్రిడ్‌లకు చెందిన దాదాపు 3 లక్షల యూనిట్లను రీకాల్ చేస్తున్నది. బ్రేక్ భాగాల్లో సమస్యల పరిష్కారార్థం ఈ రీకాల్‌కు ఈ జపాన్ టూవీలర్ దిగ్గజ సంస్థ దిగింది. కాగా, 2022 జనవరి 1 నుంచి ఈ ఏడాది జనవరి 4 మధ్య తయారైన వాహనాల్లోనే ఈ సమస్య వచ్చినట్టు కంపెనీ చెప్తున్నది. తమ కస్టమర్ల భద్రత, రక్షణకు పెద్దపీట వేస్తామని, అందుకే సమస్యను గుర్తించిన వెంటనే రీకాల్‌కు పిలుపునిచ్చామని యమహా ఓ ప్రకటనలో తెలియజేసింది. వాహనదారులకు ఉచితంగానే ఈ సర్వీస్ అందుతుందని, సమీపంలోని యమహా సర్వీస్ సెంటర్‌కు వెళ్లాలని సూచించింది.

# గోసపడ్డ 5లక్షల మంది

## విమానాల ఆలస్యంపై స్పందించిన డీజీసీఏ



ముంబై, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. గత నెలలో రెండు గంటల కంటే అధికంగా విమానాలు ఆలస్యంగా నడవడంతో 4.82 లక్షల మంది ప్రయాణికులపై ప్రతికూల ప్రభావం చూపిందని విమానయాన నియంత్రణ మండలి డీజీసీఏ వెల్లడించింది. విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో విమానసంస్థలకు రూ.3.69 కోట్ల మేర నష్టం వచ్చిందని తెలిపింది. అయినప్పటికీ ప్రయాణికుల సంఖ్య అంతకంతకు పెరిగారు. జనవరి నెలలో దేశీయంగా 4.69 శాతం పెరిగి 1.31 కోట్ల మంది ప్రయాణించారని డీజీసీఏ వెల్లడించింది. జనవరి 2023లో దేశీయంగా 1.25 కోట్ల మంది ప్రయాణించారు. విమానాల ఆలస్యంతో 1,374 మంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని తిరస్కరించడంతో విమానయాన సంస్థలకు ఖర్చులు తడిసిమోపెడు అయ్యాయి. ప్రత్యామ్నాయ విమాన సర్వీసులు సమకూర్చడంతోపాటు వసతి, రిఫ్రెష్‌మెంట్, ఆహారం కోసం రూ.1.28 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. గత నెలలో ఇండిగో 79.09 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చగా..ఎయిర్ ఇండియా విమానాల్లో 15.97 లక్షల మంది ప్రయాణించారు. మరోవైపు, గత నెలలో 732 ప్రయాణికులకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో విమానానికి సంబంధించిన ఫిర్యాదులు సగం ఉండగా, 17 శాతం రిఫండ్‌కు సంబంధించనవని పేర్కొంది. అలాగే 10 శాతం బ్యాగేజీకి సంబంధించినవి కాగా, మరో 5 శాతం సిబ్బంది ప్రవర్తనకు సంబంధించినవి.

# పసిడి డిమాండ్ 900 టన్నులు

## వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా ఎండీ సోమసుందరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: భారత్‌లో పసిడికి డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. గరిష్ఠ స్థాయిలో ధరలు కొనసాగుతున్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుత సంవత్సరంలో దేశీయంగా 900 టన్నుల పసిడికి డిమాండ్ ఉంటుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా ఎండీ సోమసుందరం తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో డిమాండ్ అంతంత మాత్రమే ఉన్నప్పటికీ, రెండో సగభాగంలో బంగారం అమ్మకాలు ఊపందుకునే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. 2023లో 745.7 టన్నుల విలువైన పసిడి విక్రయాలు జరిగాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. పుత్తడి ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం

**700-800 టన్నుల స్థాయిలోనే..**

గడిచిన ఐదేండ్లుగా భారత్‌లో పసిడి అమ్మకాలు 700 టన్నుల నుంచి 800 టన్నుల స్థాయిలోనే నమోదవుతున్నాయి. కానీ, ఈ ఏడాది మాత్రం 800-900 టన్నుల స్థాయికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుండటం, అధిక ఆదాయ వనరులు సమకూరుతుండటం ఇందుకు కారణమని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశాలుండటంతో డిమాండ్ మరింత పెరగడానికి దోహదపడనున్నదన్నారు. ఈ ఏడాది సాధరణ ఎన్నికలు జరుగుతుండటంతో పుత్తడికి డిమాండ్ పెరిగేందుకు ఆస్కారం ఉన్నదని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్, యూఏఈ, పెరూ, ఘనా దేశాల నుంచి భారత్ అత్యధికంగా పసిడి దిగుమతి చేసుకుంటున్నది. ప్రస్తుతం దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయని, దీంతో ఈ ఏడాది మరో 100 టన్నులు పెరిగేందుకు ఆస్కారం ఉన్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతో 2023లో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే.



**వడ్డీరేట్లు తగ్గే అవకాశం**

ఈ ఏడాది ద్వితీయార్థంలో పలు సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పుత్తడికి డిమాండ్ పెరిగేందుకు అవకాశాలున్నాయని పేర్కొన్నారు. 2022లో రూ.52 వేల నుంచి రూ.53 వేల స్థాయిలో కదలాడిన బంగారం 2023లో రికార్డు స్థాయి రూ.65 వేల మార్క్‌ను అధిగమించింది. మరోవైపు, అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో పసిడి వినిమయం 4 శాతం తగ్గి 266.2 టన్నులకు పడిపోయింది.

# మూడోరోజూ అదే జోరు

## 72 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్




ముంబై, ఫిబ్రవరి 15: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు మార్కెట్లకు దన్నుగా నిలిచాయి. హెవీవెట్ షేర్లు మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐలు లాభపడటంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మళ్లీ 72 వేల మార్క్‌ను అధిగమించింది. 72,165 పాయింట్ల నుంచి 71,644 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్ చివరకు 227.55 పాయింట్లు పెరిగి 72,050.38 వద్ద ముగిశాయి. వాహన, ఎనర్జీ, యుటిలిటీ స్టాక్‌లకు డిమాండ్ అధికంగా ఉండటం కలిసొచ్చింది. మరో సూచీ నిఫ్టీ 70.70 పాయింట్లు పెరిగి 21,910.75 పాయింట్లకు చేరుకున్నది. చివరి గంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు లాభాల్లోకి వచ్చాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్ల మద్దతు లభించింది.

- మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 6.51 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్‌లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- వీటితోపాటు టైటాన్, విప్రో, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, మారుతి, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, టీసీఎస్‌లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, నెస్లె, సన్‌ఫార్మా, రిలయన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, జేఎస్ డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ 2.61 శాతం, యుటిలిటీ 2.59 శాతం, పవర్ 1.99 శాతం, వాహన 1.41 శాతం, టెలికం 1.26 శాతం చొప్పున బలపడ్డాయి.
- కానీ, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు నష్టపోయాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.24 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.
- ఆసియా, జపాన్ నిక్కీ, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గి 81.53 డాలర్ల వద్ద నిలిచింది.